# ఎంపీ రవిచంద్రను ఆహ్వానించిన ఖైరతాబాద్ ఉత్సవ సమితి సభ్యులు



ఎంపీ వద్దిరాజును సత్కరిస్తున్న ఖైరతాబాద్ గణేష్ కమిటీ సభ్యులు

ఖమ్మం, సెప్టెంబర్ 9 : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రను ఖైరతాబాద్ మహా గణేష్ ఉత్సవ కమిటీ ప్రముఖులు సోమవారం కలిశారు. హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్ రైల్వేట్రాక్ సమీపాన గత 50 ఏండ్లకు పైగా వినాయకుడి భారీ విగ్రహాన్ని నెలకొల్పి నవ రాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వినాయక నవ రాత్రోత్సవాల సందర్భంగా మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయాల్సిందిగా కోరుతూ ఉత్సవ కమిటీ ప్రముఖులు సోమవారం రాత్రి ఎంపీ రవిచంద్రను ఆహ్వానించారు. ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించి ఆహ్వానం పత్రం అందజేసిన వారిలో విష్ణు పటేల్, రాజకుమార్, నరేందర్, నర్సింగ్, మహేష్, కార్తీక్, వెంకట్ ఉన్నారు.

# దెబ్బతిన్న గృహాల పరిశీలన



బాంబు బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 9: కిష్టారం ఓపెన్ కాస్ట్ మైనింగ్‌లో బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా మండలంలోని కిష్టారం ఎస్సీ కాలనీలో 250 ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలనీలో అనేక ఇల్లు పేలుళ్లకు చిద్రమయ్యాయి. బాధితులంతా స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి తీసుకెళ్లి విషయాన్ని వివరించారు. బాధితుల ఇబ్బందులను తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌విజయ్‌కుమార్ సోమవారం కిష్టారం ఎస్సీకాలనీని ఓసీ పీవో ఎం.వీ.నరసింహారావును తీసుకొని వెళ్లి దెబ్బతిన్న ఇళ్లను సందర్శించారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన దయానంద్ బాధితులతో మాట్లాడారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించడానికి దయానంద్‌తో వచ్చిన పీవో నరసింహారావుపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబు బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు కూలుతున్న విషయమై ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడారు. కిష్టారం ఎస్సీ కాలనీలో బ్లాస్టింగ్ కారణంగా దెబ్బతిన్న ఇళ్లను స్వయంగా పరిశీలించాలని కోరారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌కుమార్, నాయకులు ఉన్నారు.

# సిఫార్సుల సర్వే?

- పెదవాగు ఆయకట్టు రైతుల సర్వేలో నిబంధనలు పాటించని అధికారులు
- 'నమస్తే' కథనంతో అక్రమాలపై ఆరా తీస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది


నమస్తే తెలంగాణ
అర్హులకు మొండిచేయి

'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనం

అశ్వారావుపేట, సెప్టెంబర్ 9 : వ్యవసాయాధికారులు కనీస నిబంధనలు పాటించకుండా.. ఏకపక్షంగా పెదవాగు ఆయకట్టు బాధితుల సర్వే చేసినట్లు తెలుస్తుంది. గుమ్మడవల్లి పెదవాగు ప్రాజెక్టు కట్ట జూలై 18న అధిక వర్షాలకు కొట్టుకుపోయి వరద ముంచెత్తడంతో ఆయకట్టు పొలాలపై ఇసుక, రాళ్లు మేటలు వేసిన విషయం తెలిసిందే. పరిహారం చెల్లింపు కోసం ప్రభుత్వం వ్యవసాయాధికారులను ఆదేశించగా.. 19వ తేదీనే ప్రాథమిక నివేదికను అందించారు. అయితే 20వ తేదీన ఒక్కరోజే డివిజన్‌లో మొత్తం 11 మంది ఏఈవోలు సర్వే చేసి బాధిత రైతుల జాబితాను ప్రభుత్వానికి అందించారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం బాధితుల ఖాతాల్లో జమ కాగా.. అప్పటివరకు అధికారులు రైతుల జాబితాను గోప్యంగా ఉంచారు. అయితే పరిహారం చెల్లింపు తర్వాత జాబితా బహిర్గతం కావడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

**'నమస్తే కథనం హల్‌చల్**

పెదవాగు ప్రాజెక్టు పరిహారం చెల్లింపులో అక్రమాలపై సోమవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్ వాట్సాప్ గ్రూపులలో హల్‌చల్ చేస్తుంది. దీనిని కొందరు రైతులు గ్రూప్‌లో ఫార్వర్డ్ చేయడంతో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో పూర్తి వివరాల కోసం ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఖంగుతిన్న వ్యవసాయాధికారులు మళ్లీ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఇప్పటికే ఏపీ భూములకు సంబంధించి పరిహారం పొందిన రైతులను అధికారులు అప్రమత్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అవసరమైతే పరిహారం సొమ్ము తిరిగి చెల్లించేందుకు ముగ్గురు రైతులు సిద్ధమైనట్లు సమాచారం. వీరితోపాటు తక్కువ విస్తీర్ణం ఉండి ఎక్కువ పరిహారం పొందిన రైతులు, అసలు భూమి లేని ఇతర రైతుల వివరాలు సేకరిస్తూనే వారిని సిబ్బంది కొందరు అప్రమత్తం చేస్తున్నట్లు తెలుస్తుంది.

**రాజకీయ సిఫార్సులకే ప్రాధాన్యం?**

అర్హులైన రైతులను గుర్తించడంలో వ్యవసాయాధికారులు రాజకీయ సిఫార్సులకే ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం కొందరు చెప్పిన పేర్లను రాసుకుని పరిహారం మంజూరు కోసం పంపించారనే వాదన వినిపిస్తుంది. ఇందులో ఒక ఎమ్మెల్యే పీఏ కీలక పాత్ర పోషించినట్లు పరిహారం అందని బాధిత రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే చేసి నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలన్న డిమాండ్ స్థానికంగా వ్యక్తమవుతోంది. దీనిపై ఏవో శివరామ్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. అసలు ఏం జరిగిందో వివరాలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

## ఏఐటీయూసీకి 'గుర్తింపు' పత్రం




గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 9 : సింగరేణిలో ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలల తర్వాత యాజమాన్యం ఎట్టకేలకు గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బృందానికి గుర్తింపు పత్రాన్ని అందించింది. సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎండీ బలరాం చేతుల మీదుగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అందుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వైవీ రావు, ఎల్.ప్రకాశ్, స్వామి, కందుకూరి రాజారత్నం, ఆరెల్లి పోషం, 11 ఏరియాల సెంట్రల్ ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

# భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి



భద్రాచలం : గోదావరి వరద ప్రవాహం

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 9 : ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్నది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు నిలకడగా ఉన్న నీటిమట్టం 27.9 అడుగులకు చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలతోపాటు తాలిపేరు ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తిన అధికారులు లక్షా 40 వేల క్యూసెక్కుల నీటికి దిగువకు వదిలారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవడంతో శబరి వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో ఆ వరద పోటెత్తడంతో భద్రాచలం వద్ద మరింతగా నీటిమట్టం పెరుగుతోంది. రాత్రికి గోదావరి వరద ప్రవాహం మరింతగా పెరుగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 9: మండలంలోని ఇనగాలి గ్రామపంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ రాజ్యలక్ష్మి, దివ్యాంగుల మండల అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ మధిర డిపో దివ్యాంగుల బస్సుపాస్ మేళా నిర్వహించారు. 20 మంది దివ్యాంగులకు 50 శాతం రాయితీతో కూడిన బస్‌పాస్‌లు అందజేశామని డిపో మేనేజర్ డీ శంకర్‌రావు తెలిపారు. అదే విధంగా మంగళవారం మండలంలోని శఖునవీడు గ్రామపంచాయతీ దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## తాలిపేరు 24 గేట్లు ఎత్తి నీటి విడుదల

చర్ల, సెప్టెంబర్ 9 : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు, కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండవాగుల నుంచి పొంగి వచ్చిన వరద నీరు తాలిపేరు రిజర్వాయర్‌లోకి చేరుతున్నది. దీంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం 24 గేట్లను పూర్తిగా ఎత్తి లక్షా 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. వరదతో తేగడ సమీపంలో ఉన్న లో లెవల్ చప్టా నీట మునిగింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వరద ఇంకా పెరిగే అవకాశం ఉందని డీఈ తిరుపతి తెలిపారు. తాలిపేరు లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతున్నది. కొండ వాగులు పొంగడంతో ఏజెన్సీ గ్రామాలకు తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్

**పలువురికి స్వల్ప గాయాలు**

వైరాటౌన్(ఏన్కూరు), సెప్టెంబర్ 9: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా పలువురికి గాయాలైన ఘటన సోమవారం ఏన్కూర్ మండలంలో చోటు చేసుకుంది. ఏన్కూరు ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరు మండల పరిధిలోని గార్లొడ్డు సమీపంలో రోడ్డు పక్కన ట్రాక్టర్ నిలిపి ఉన్నది. భద్రాచలం నుంచి మియాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణీకులను వేరే బస్సులో పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు














